సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం, 25, ఫిబ్రవరి, 2023



వెండి కిరీటం సమర్పణ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్నకు కె.శ్రీనివాసవర్మ (హైదరాబాద్) అనే భక్తుడు 1.370 కిలోల వెండి కిరీటాన్ని సమర్పించారు.



డీఈఓ తనిఖీ

పెనుగొండ: స్థానిక బాలికల పాఠశాలను పశ్చిమగోదావరి జిల్లా డీఈఓ ఆర్.వెంకట రమణ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.



మెరుగైన సేవలందించాలి

ఏలూరు(మెట్రో): డీఎంహెచ్ఓ డాక్టర్ డి.ఆశ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి మొక్క అందించాలి. మెరుగైన సేవలందించాలని ఆయన సూచించారు.

ప్రగతి బాటలు

- చురుగ్గా భీమవరం–యండగండి రోడ్డు పనులు
- రూ.15 కోట్లతో అభివృద్ధి
- యండగండి–పిప్పర రోడ్డుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో నిర్మాణం

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధానమైన భీమవరం–యండగండి రహదారి పనులను సుమారు రూ.15.9 కోట్ల వ్యయంతో సీఆర్ఎఫ్ పథకంలో చేపట్టారు. పనులు వేగంగా జరుగుతుండగా.. ఇప్పటికే దాదాపు గరగపర్రు గ్రామం వరకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది.

జిల్లాలో ప్రధాన రహదారి : భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లేందుకు ప్రధానమైన ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఆర్టీసీ బస్సులతో పాటు సరుకు రవాణా వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డుకు ఇరువైపులా పంట కాలువ, మురుగు కాలువలు ఉండటంతో తరచూ గోతులు పడుతున్నాయి. రహదారిని పూర్తిస్థాయిలో పటిష్టంగా నిర్మించాలనే డిమాండ్ ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. నామమాత్రపు మరమ్మతులతో సరిపెట్టేశారు. ఈ నేపథ్యంలో భీమవరం నుంచి పిప్పర వరకు రోడ్డు సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిలో భాగంగా భీమవరం నుంచి యండగండి వరకు సుమారు 8.56 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.15.9 కోట్లు సీఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసింది. దీంతో ఆర్ అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇరువైపులా



హాయిగా ప్రయాణం: నిర్మాణం పూర్తిచేసుకున్న భీమవరం–గరగపర్రు రహదారి

రోడ్డును విస్తరించడంతో పాటు తారుతో పటిష్టంగా నిర్మాణ పనులు చేపట్టారు. భీమవరం నుంచి గరగపర్రు వరకు దాదాపు రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. గరగపర్రు నుంచి యండగండి వరకు పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ఇప్పటికే రోడ్డు రెండువైపులా విస్తరించి మొదటి పొర కంకర వేసి చదును చేశారు. మరో పొర కంకరతో చదును చేసి తారు రోడ్డు వేయాల్సి ఉంది. రహదారి పనులను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

7 కిలోమీటర్లు.. 10 కోట్లు

యండగండి నుంచి పిప్పర వరకు రహదారిని ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో నిర్మించడానికి రూ.10 కోట్లు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 7 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిస్తే త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టే వరకూ తాత్కాలిక మరమ్మతులు చేసి వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.



గరగపర్రు నుంచి యండగండి వరకు ఇలా..

చురుగ్గా పనులు



భీమవరం నుంచి యండగండి వరకు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గరగపర్రు వరకు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి. యండగండి నుంచి పిప్పర వరకు ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

– ఎస్.లోకేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, భీమవరం

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ

భీమవరం (ప్రకాశంచౌక్): పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి నరసాపురం ప్రాంతంలో భూమిని సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందు వచ్చే వారికి త్వరితగతిన అనుమతులు, బ్యాంకు రుణాలను మంజూరు చేయాలన్నారు. నరసాపురం ప్రాంతంలో స్థాపనకు అనువైన పరిశ్రమలను గుర్తించాలన్నారు. సింగిల్ డెస్క్ ఆమోదానికి 11 దరఖాస్తులు రాగా తొమ్మిదింటిని ఆమోదించామన్నారు. పారిశ్రామిక రాయితీలు, 16 కేసులు పరిష్కారానికి రూ.1,67,57,000 మంజూరు చేశారన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 80 దరఖాస్తులు లక్ష్యం కాగా 128 దరఖాస్తులను బ్యాంకులకు పంపామన్నారు. వచ్చేనెలలో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ముద్రా లోన్ కింద 66,642 మందికి రూ.83.74 కోట్లు, కిషోర్ పథకం కింద 22,099 మందికి రూ.262.34 కోట్లు, తరుణ్ పథకం కింద 3,724 మందికి రూ.215.73 కోట్లు అందించామని జిల్లా పరిశ్రమల అధికారి ఉయ్యాల ఆదిశేషు తెలిపారు. భీమవరం, తణుకులో ఫ్లైయాష్ బ్రిక్స్ యూనిట్లలో తయారీ మొదలైందన్నారు. అలాగే యలమంచిలి మండలం కొంతేరు, తాడేపల్లిగూడెం, నరసాపురం మండలం రుస్తుంబాదలో యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.

న్యూస్‌రీల్

వేగంగా ఇళ్ల నిర్మాణం



సమీక్షిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

ఆకివీడు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని భీమవరం ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఉగాది నాటికి మరిన్ని ఇళ్ల నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, కమిషనర్ తిరుమలరావు, హౌసింగ్ డీఈ శివ రామరాజు, ఏఈ భాస్కరరావు పాల్గొన్నారు. స్థానిక సమతానగర్‌లో కాంటూర్ భూమిలో అక్రమ లేఅవుట్ నిర్మించారని, దీనిలో ప్రభుత్వ భూమి ఉందని సీపీఎం నాయకులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆర్డీఓ ఆదేశించారు.

సృజనకు ఉల్కాన్‌జీ దోహదం



వేడుకలకు వస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: అందివచ్చిన అవకాశాలను విడిచిపెట్టకుండా ఒడిసి పట్టుకోవాలని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్‌లో జరుగుతున్న ఉల్కాన్‌జీ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆలోచనల్లో నూతనత్వం మార్పునకు స్వాగతం పలుకుతుందన్నారు. విద్యార్థులు విభిన్న విషయాలపై దృష్టి సారించాలన్నారు. మెదడు చురుగ్గా పనిచేసేందుకు ఉల్కాన్‌జీ వంటి సాంకేతిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలపై దృష్టి పెడితే ఈ ప్రభావంతో విజయాలు సాధించవచ్చన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. ఉల్కాన్‌జీ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు తరలివచ్చారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ



చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాళ్ల: ఏలూరుపాడు గాంధీ బజారులో చేపల చెరువుల తవ్వకాలకు అనుమతి ఇవ్వవద్దని స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టారు. ఆ గ్రామానికి చెందిన కొండపల్లి మోహనరావు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. గాంధీ బజారులో ఇద్దరు రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చెరువులు తవ్వేందుకు పొక్లయిన్‌తో పనులు ప్రారంభిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ టీపీ కృష్ణారావు, ఆర్ఐ రాఘవమూర్తిరాజు, వీఆర్వో మణికుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని వీఆర్వోను తహసీల్దార్ ఆదేశించారు.

చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చట్టంపై ప్రతి వ్యక్తి అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోపాలున్నా ఎవరికి ఫిర్యాదు చేయాలి, సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడితే పరిష్కరించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు హరిబాబు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ నియోజకవర్గాల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. మొత్తం 8 మంది అభ్యర్థులు 15 నామినేషన్లు దాఖలు చేయగా నామినేషన్ల పరిశీలన అనంతరం ఏడుగురు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు గుర్తించారు. కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ (వైఎస్సార్‌సీపీ), వంకా రాజకుమారి, వీరవల్లి చంద్రశేఖర్, దేవరపల్లి ఆదాం, గోరింక దాసు, పసల వెంకటాచలం (స్వతంత్ర) అభ్యర్థుల నామినేషన్లను పరిగణనలోకి తీసుకున్నట్టు అరుణ్‌బాబు తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన నల్లి రాజేష్ నామినేషన్ మూడు సెట్లూ నిబంధనల మేరకు లేకపోవడంతో తిరస్కరించామన్నారు.

చెరువుల తవ్వకంపై పిటిషన్

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లిలో చేపల చెరువులకు అనుమతులు ఇవ్వవద్దని గ్రామానికి చెందిన రైతు ఎరిచర్ల ప్రభాకరరావు హైకోర్టులో పిటిషన్ వేసినట్టు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. చెరువుల తవ్వకాన్ని నిలుపుదల చేయాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. ఈ ప్రాంతం ఆక్వాజోన్‌లో ఉండటంతో చెరువుల తవ్వకానికి ఇబ్బంది లేదని కొందరు రైతులు.. చేపల చెరువులతో తమ పంటలు పాడవుతున్నాయని మరికొందరు రైతులు అన్నారు. ఫైవ్ మెన్ కమిటీ దృష్టికి ఈ అంశాలను తీసుకువెళతామని తహసీల్దార్ తెలిపారు. 30 మందికి పైగా రైతులు హాజరయ్యారు.

ఆగని ఆగ్రహ జ్వాల





భీమవరంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, పెదఅమిరంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

సాక్షి, భీమవరం/కాళ్ల: అసత్య కథనాలతో రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలనే లక్ష్యంతో ఈనాడు పత్రిక సమాజంలో తన ఉనికిని కోల్పోయిందని భీమవరం ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గానాగమల్లేశ్వరరావు (బాబు), వైఎస్సార్ సీపీ నాయకులు తోట భోగయ్య, గూడూరి ఉమాబాల మండిపడ్డారు.

ఈనాడు పత్రిక తప్పుడు రాతలను నిరసిస్తూ శుక్రవారం భీమవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ నేత పట్టాభిని కొట్టారంటూ పాత ఫొటోలతో ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లడానికి ఈనాడు చేసిన కుట్ర బహిర్గతమైందన్నారు. ముఖ్యమంత్రిగా

'ఈనాడు' ప్రతుల దహనం.. నిరసనలు

వైఎస్ జగన్ పదవి చేపట్టినప్పటి నుంచి అసత్య వార్తలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 'పచ్చ' రాతలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పార్టీ నాయకులు కోడే విజయలక్ష్మి, పాలవెల్లి మంగ, కానుబోయిన వెంకటరమణ, మానేపల్లి నాగన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విలువలను దిగజార్చుతూ..

కాళ్ల: ఈనాడు అధినేత రామోజీరావు పాత చిత్రాలను కొత్తవిగా చూపించే ప్రయత్నంలో జర్నలిజం విలువలను దిగజార్చారని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆదేశాల మేరకు ఆయన సోదరుడు పెనుమత్స గోపాలకృష్ణరాజు ఆధ్వర్యంలో పెదఅమిరంలోని పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈనాడు ప్రతులను దహనం చేశారు. నాయకులు పెనుమత్స గోపాలకృష్ణరాజు, జెడ్పీటీసీలు సోమేశ్వరరావు, రణస్తుల మహంకాళి మాట్లాడుతూ చంద్రబాబు పోసిన 'పచ్చ' సిరాను పెన్నుల్లో నింపేసుకుని రామోజీరావు రాష్ట్రంపై, సీఎం జగన్‌పై తప్పుడు వార్తలు, కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరిరాజు, కాళ్ల, ఉండి మండల పార్టీ కన్వీనర్లు రాంబాబు పెనుమత్స ఆంజనేయరాజు కోపల్లె, కలవపూడి, ఉండి సొసైటీల చైర్మన్లు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పెనుమత్స ప్రసాద్‌రాజు, పేరిచర్ల సూర్యనారాయణ రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిబద్ధతతో సేవలందించాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ విస్తరణాధికారులతో నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను జిల్లాస్థాయి స్పందనలో ఫిర్యాదు అందించే పరిస్థితికి స్వస్తి పలికేలా కార్యదర్శుల సేవలు నిబద్ధతతో ఉండాలన్నారు. నిత్యం పంచాయతీల్లో స్పందన దరఖాస్తులను తీసుకొని పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. భీమవరం రెవెన్యూ డివిజన్‌లోని 52 గ్రామాల్లో ఇప్పటికే భూ రీ సర్వే పనులు పూర్తయ్యాయని, నరసాపురం డివిజన్‌లో సోమవారం నుంచి ప్రారంభమవుతాయన్నారు. గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లో పూడికతీత, కొత్త చెరువుల నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేపట్టాలన్నారు. చెరువు మట్టిని గ్రామంలోని శ్మశాన వాటికలు, లోతట్టు ప్రాంతాల పూడికకు వినియోగించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, డ్వామా పీడీ ఎస్‌టీజీ రాజేశ్వరరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఏఎస్‌ఏ రామస్వామి, భీమవరం డీఎల్‌డీఓ కె.కృష్ణకిషోర్, డీఎల్‌పీఓ బి.రెడ్డయ్య పాల్గొన్నారు.

ప్రతి మాటలోనూ అభద్రతా భావం

- ఇన్‌చార్జిలపైనా అపనమ్మకం
- సరైన నివేదిక రావడం లేదని ఆక్రోశం
- టీడీపీ జోన్–2 సమావేశంలో చంద్రబాబు తీరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఏమీ మారలేదు.. ఆయనలో అదే అభద్రతా భావం ఇప్పటికీ ఉంది అని సాక్షాత్తూ ఆ పార్టీ నాయకులే చర్చించుకున్నారు. శుక్రవారం టీడీపీ జోన్–2 సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించిన తీరుపై ఆ పార్టీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా ప్రభుత్వంపైనా, వైఎస్సార్ సీపీపైనా, ప్రజలపైనా, పోలీసులపైనా విమర్శలే లక్ష్యంగా ఆయన ప్రసంగం సాగిందని పెదవి విరిచారు. ఆయనను ఇప్పటికీ అదే అభద్రతాభావం వెన్నాడుతోందని వ్యాఖ్యానించారు. దీనికి చంద్రబాబు ప్రసంగంలోని కొన్ని అంశాలు బలం చేకూర్చుతున్నాయి. తన ప్రసంగంలో పలు చోట్ల తాను ఏరి కోరి పెట్టుకున్న క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికార సారథులు తనకు సరైన నివేదిక ఇవ్వడం లేదని, మీరు నాకు భరోసా ఇవ్వాలని, మిమ్మల్ని నమ్మవచ్చా అని ప్రశ్నించి వారిపైనా అపనమ్మకం వ్యక్తం చేశారు. వారు సరిగా పనిచేస్తేనే తాను ముఖ్యమంత్రి అవుతానని వారి ముందే చెప్పడం 40 ఏళ్ల రాజకీయ అనుభవమున్న చంద్రబాబు వ్యాఖ్యలేనా అనిపిస్తుంది.

డైలమాలో పడేలా.. టీడీపీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో చెప్పకుండా కేవలం వైఎస్సార్ సీపీ వైఫల్యాలను మాత్రమే ప్రజల్లో ప్రచారం చేయాలనడంతో ఇన్‌చార్జిలు డైలమాలో పడేలా ఉన్నారు. టీడీపీ ఏంచేస్తుందని ప్రజలు అడిగితే ఏం సమాధానం చెప్పాలో కూడా ఇన్‌చార్జిలు చెప్పలేని పరిస్థితి ఎదురవుతుంది. దీనికితోడు వైఎస్సార్ సీపీ నాయకులు తమపై పెడుతున్నవి తప్పుడు కేసులేనని నమ్మించగలిగేలా ఒక్క ఉదాహరణ కూడా టీడీపీ అధినేత ప్రస్తావించలేదు. తమ వారిపై కేసులు పెట్టిన వారిని ఊరుకోబోనని చెప్పి పోలీసులనూ బెదిరిస్తున్నట్లు ప్రజలకు అర్థమవుతోంది. నెల్లూరులో 9 మంది, గుంటూరులో ముగ్గురు చనిపోవడానికి ఇరుకు సందుల్లో సమావేశం నిర్వహించడమే కారణం కాగా అది కూడా పోలీసుల వల్లనే జరిగిందని చంద్రబాబు ఈ సమావేశంలో చెప్పడం ఆయన అబద్ధపు ప్రచారాలకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు. వైఎస్సార్ సీపీకి ఓటు వేసిన వారిని ఆడిపోసుకునేలా ప్రజలు దొంగలనూ ఆదరిస్తారని పేర్కొనడం జనాగ్రహానికి గురయ్యే వ్యాఖ్యలుగా ఉన్నాయి.

నిస్సిగ్గుగా అబద్ధాలు

ప్రజలకు మెమొరీ తక్కువ అంటూ వారిని తక్కువ అంచనా వేసేలా చంద్రబాబు వ్యాఖ్యలున్నాయి. బాబు తన ప్రసంగంలో టీవీ9, ఎన్‌టీవీ వాళ్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క వార్తా వేయరని అక్కసు వ్యక్తం చేశారు. కాగా వలంటీర్లను పిల్ల సైకోలని, ముఖ్యమంత్రి జగన్‌పైనా నోటి దురుసును ప్రదర్శించారు. మరో ముఖ్యమైన అంశమేమంటే.. ఊరూరా పేదలకు పంపిణీ చేసిన స్థలాల్లో జగనన్న కాలనీలు కొత్త ఊళ్లలా వెలుస్తుండగా.. కేవలం ఐదు ఇళ్లు మాత్రమే ఈ మూడున్నరేళ్ల కాలంలో పూర్తయ్యాయంటూ చంద్రబాబు సమావేశంలో చెప్పడం.. ఆయన అబద్ధపు, అసత్య ప్రచారాలు ఎంత నిస్సిగ్గుగా చేస్తున్నారనే విషయం తేటతెల్లమైంది. ఊరూరా కాలనీలు ఏర్పడుతుంటే.. ఐదిళ్లు మాత్రమే కట్టారని చంద్రబాబు చెప్పడం మరోపక్క సమావేశానికి హాజరైన ఆ పార్టీ కేడర్‌నే విస్తుపోయేలా చేయడం, వారంతా చెవులు కొరుక్కుంటుండటం కనిపించింది.

గవర్నర్‌కు శుభాకాంక్షలు





రాజ్‌భవన్‌లో రాష్ట్ర నూతన గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు.

– సాక్షి, విజయవాడ

27న ఈపీఎఫ్ఓ సమావేశం

సాక్షి, భీమవరం: ఈపీఎఫ్ఓ ఆధ్వర్యంలో ఈనెల 27న భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో నిధి ఆప్‌కే నికట్ జిల్లాస్థాయి ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తున్నట్టు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిష్య నిధి అంతిమ ఉపసంహరణ, ఖాతాల బదిలీ, యుఏఎన్ సమస్యలు వంటి వాటిపై చర్చిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



హైదరాబాద్‌లో ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న ముళ్లపూడి నరేంద్రనాథ్

తణుకు : తణుకు ఆంధ్రా సుగర్స్ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఈనెల 20 నుంచి 23 వరకు హైదరాబాదులో జరిగిన 31వ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ సుగర్ కేన్ టెక్నాలజిస్ట్స్ (ఐఎస్ఎస్‌సీటీ) కాంగ్రెస్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ అవార్డు అందుకున్నారు. భారతదేశంలో చక్కెర, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి విశేష కృషి, విశిష్ట సహకారానికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఈ సమావేశాల్లో 36 దేశాల నుంచి సుమారు 500 పైగా ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారని చెప్పారు. దాదాపు 100 ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ పరికరాల తయారీదారులు తమ తాజా ఆవిష్కరణలు, ఉత్పత్తులు, సేవలను చక్కెర పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమల కోసం ప్రదర్శించారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరి అరెస్టు

ఆకివీడు : స్థానిక మార్కెట్ యార్డు ప్రాంతంలో బాలికపై అత్యాచార యత్నానికి ప్రయత్నించిన ఇద్దరిని శుక్రవారం భీమవరం కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి చెప్పారు. స్థానిక శ్రీనగర్ కాలనీకి చెందిన ఎస్కే.మస్తాన్, ఎస్కే.ఖాన్‌లకు కోర్టు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ



మార్టేరు వేణుగోపాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర : ఇటీవల నూజివీడులో జరిగిన అంతర్‌జిల్లా అండర్–14, అండర్–17 బాస్కెట్‌బాల్ పోటీలలో మార్టేరుకు చెందిన శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాలకు చెందిన బాలురు, శ్రీబాసంతీదేవి బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెల్లబోయిన శివజ్యోతి, ఎస్వీ గణపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాలకు చెందిన జుత్తిగ అనీష్, మారుమూడి కృపాల్, పెనుగొండ కిరణ్ అండర్–14 విభాగంగలో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారని, అదేవిధంగా అండర్–17 విభాగంలో నక్కా సందీప్, గెద్దాడ శివసాయి, నీలాపు వినయ్, అప్పారి మోహన్ రామ్‌శెట్టి పశ్చిమ గోదావరి జట్టుకు రజత పతకం అందించారని పీఈటీ కర్రి కృష్ణారెడ్డి తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో వాసంతీదేవి బాలికోన్నత పాఠశాలకు చెందిన బి జ్యోష్ని గోల్డ్ మెడల్ సాధించినట్లు పీడీ వారధి వెంకటరమణ తెలిపారు. విద్యార్థులను మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తదితరులు అభినందించారు.

మండపాకలో కోతుల పట్టివేత



మండపాకలో కోతులను పట్టుకుంటున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో కోతుల దాడిలో పలువురు గాయపడిన నేపథ్యంలో గ్రామంలోని కోతులను పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టేందుకు గ్రామ పంచాయితీ సిబ్బంది శుక్రవారం పనులు ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేకంగా వేట ప్రారంభించి కోతులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా తయారు చేసిన బోనులను ఏర్పాటు చేసి కోతులను పట్టుకున్నారు. వీటితోపాటు గ్రామంలో కోతుల దాడిలో గాయపడిన వారిని గుర్తించి వైద్య సాయం అందించేందుకు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామంలో శుక్రవారం పర్యటించి వివరాలు సేకరించారు. గాయపడిన వారికి అన్ని రకాల వైద్య సేవలు అందించడంతో పాటు పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య సేవలు అందించేలా ఫస్ట్ ఎయిడ్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యుగంధర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది ప్రసాద్, సూపర్‌వైజర్లు జయరాజు, రాణి, హెల్త్ అసిస్టెంట్ వైటీ మూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ పీ.సుధా ప్రవీణ్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ : ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ



పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నరసాపురం : వైఎన్ కళాశాల విద్యార్థులు అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీల్లో బహుమతులు సాధించారు. యూపీకి చెందిన చారు క్యాసిల్ పొండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీల్లో కళాశాల డిగ్రీ విద్యార్థులు ఆర్.జ్యోతిరత్నం, ఎన్.బాలమురళీకృష్ణ, ప్రి.ప్రసూన, కె.గణేష్‌లు పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏపీవీ అప్పారావు చెప్పారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో జరిగిన ఇలాంటి అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలవడం అభినందనీయమన్నారు. తోటి విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.


రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


పోడూరు: పాలకొల్లు–మార్టేరు మార్గంలో జిన్నూరు నరసింహారావుపేట వద్ద జరిగిన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డారు. నరసాపురం మండలం లిఖితపూడి గ్రామానికి చెందిన యనమదుర్తి సుబ్బారావు తన భార్య మంగతాయారు(55)తో కలసి ద్విచక్రవాహనంపై పాలకొల్లు వైపు వస్తుండగా కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని టిప్పర్‌లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. మంగతాయారు రోడ్డుపై పడిపోగా ఆమె తలపైనుంచి టిప్పర్‌లారీ వెళ్లడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఆమె భర్త సుబ్బారావు తీవ్రంగా గాయపడ్డారు. సుబ్బారావు దంపతులు పెనుగొండ మండలం కొఠాలపర్రు గ్రామంలో వివాహ వేడుకకు వెళ్లి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. 108 వాహనంలో సుబ్బారావును పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇళ్ల నిర్మాణం వేగం పెంచాలి

భీమవరం (ప్రకాశంచౌక్) : ప్రభుత్వం ఉచితంగా కట్టించే ఇళ్ల నిర్మాణాల వేగం పెరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ పి.ప్రశాంతి ఆప్షన్–3 పేదల ఇళ్ళ నిర్మాణాలపై ఏజెన్సీల ప్రతినిధులు, గృహ నిర్మాణం, మైనింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆప్షన్–3 ఎంపిక చేసుకున్న లబ్ధిదారులు 37,826 మంది ఉన్నారని, ఇప్పటికి 6,758 గృహ నిర్మాణాలు చేపట్టామన్నారు. తణుకు, నరసాపురం, పాలకొల్లు లే అవుట్ల లెవలింగ్ పనులకు అవసరమైన మట్టికి మైనింగ్ అధికారులు సోమవారం నాటికి పర్మిషన్లు మంజూరు చేయాలన్నారు.

● మూడు అడుగులు పైకి..





ప్రస్తుత రోజుల్లో ఇళ్లను పైకి లేపడం కూడా సాధ్యమైంది. ఆకివీడు మాదివాడలో అత్తిలి శ్రీనుకు చెందిన భవనాన్ని 2000వ సంవత్సరంలో నిర్మించారు. అప్పుడు రోడ్డు లెవల్‌కు భవనం నిర్మించారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణంతో భవనం పల్లం అవడంతో వర్షపు నీరు లోపలికి వస్తుంది. దీంతో యజమాని శ్రీను బీహార్‌కు చెందిన కార్మికుల సాయంతో భవనాన్ని ఎత్తు చేసేందుకు నిర్ణయించారు. మూడు అడుగుల ఎత్తుకు భవనం పైకి లేపి, కింద భాగంలో కాంక్రీట్ వేస్తారు. ఈ విధంగా పైకి లేపి ఎత్తు చేసినందుకు అడుగుకు రూ.600 ఖర్చు అవుతుందని చెప్పారు. భవనం పైకి లేపేందుకు పునాదులలో జాకీలు అమర్చారు.

– ఆకివీడు

క్లుప్తంగా

ప్రాణరక్షణకు హెల్మెట్ తప్పనిసరి



చినతాడేపల్లి రిలయన్స్ పెట్రోలు బంకు నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి రక్షణ పొందడానికి హెల్మెట్ తప్పనిసరి అని రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు అన్నారు. హెల్మెట్‌పై అవగాహనలో భాగంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని చినతాడేపల్లి రిలయన్స్ పెట్రోలు బంకు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరభద్రరావు మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, వాహనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామాల్లో భూ సర్వే ప్రారంభం

పాలకోడేరు: మండలంలోని మోగల్లు, కోరుకొల్లు గ్రామాల్లో భూ సర్వే శుక్రవారం నుంచి ప్రారంభమైంది. అందులో భాగంగా తొలుత గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్ గుర్తించారు. దీని ప్రకారం డ్రోన్ సర్వే జరిగేటప్పుడు డ్రోన్ సరిగ్గా పాయింట్ దగ్గరే నిలుస్తుందని తహసీల్దార్ షేక్ హుస్సేన్ తెలిపారు. కొలతలు కచ్చితంగా ఉంటాయని స్పష్టం చేశారు. విలేజ్ సర్వేయర్లు కిషోర్, మనోజ్ పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: జగనన్న భూ సర్వే హక్కు రక్ష పథకంలో భాగంగా శుక్రవారం రాయకుదురు, చింతలకోటి గరువు గ్రామాల్లో డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులంతా తమ హక్కు పత్రాలతో రెవిన్యూ అధికారులకు సర్వేయర్ సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ ఎం.సుందర్రావు తెలిపారు. నాని, అనిషా, వెంకట్రావు, ఇందిరా శైలజ, షరీఫ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సాక్షి, భీమవరం: విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో రుచికరమైన ఆహారం అందించాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో–ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీభాయి మునిసిపల్ పాఠశాల, నెహ్రూపేట ప్రాథమిక పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించడంతోపాటు పాఠశాలలో మంచినీరు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీవీ శ్రీనివాస్, ఎస్.వెంకటపతిరాజు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు పదవులతో గౌరవం

భీమవరం (ప్రకాశంచౌక్): కుల మతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాలకు ఉన్నత పదవులు కేటాయించి వారిని గౌరవించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్క సంక్షేమ పథకాలతో బలహీన వర్గాలను ఆదుకుంటూ మరో పక్క వారిని రాజకీయంగా చైతన్యం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలుస్తున్నారన్నారు. 18 శాసన మండలి స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కలిపి 14 మందికి అవకాశం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు.

ఖాజీగా నియమితులైన ఫైజీకి సత్కారం

సాక్షి, భీమవరం: స్థానిక సున్ని జామియా మసీదు గురువు (ఇమాం) జనాబ్ మోయిజ్ ఆలం ఫైజీని భీమవరం డివిజన్ ప్రభుత్వ ఖాజీగా నియమించడం హర్షణీయమని ముస్లిం జేఏసి కన్వీనర్ జనాబ్ ముహమ్మద్ సిద్దీఖ్ అన్నారు. శుక్రవారం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మసీదులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెఏసి సభ్యులు ఎమ్.ఎమ్. పాషా, సయ్యద్ ఫర్హాన్, ఖాజా, షేక్ ఫరీద్ బాబా, సోహైల్, అన్సారీ పాల్గొన్నారు.

13 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మార్చి 13 నుంచి శ్రీ శ్రీనివాస అద్భుత శాంతి మహాయాగపూర్వక శ్రీవారి అష్ట బంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యాగశాల నిర్మించేందుకు ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజుతో ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు పందిరిరాట ముహూర్తం చేయించారు.

బాలిక అదృశ్యం

ఆకివీడు: మండలంలోని చెలిమిల్లిపాడు గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రాజారెడ్డి శుక్రవారం చెప్పారు. ఆ బాలిక భీమవరంలోని ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతుందని పేర్కొన్నారు. బంధువుల ఇంటి వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

తల్లీబిడ్డా రక్షణకు కిల్కారీ సేవలు

- కొత్త కార్యక్రమానికి కేంద్రం రూపకల్పన
- శిక్షణ పొందుతున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు



కిల్కారీ సేవలకు సంబంధించి గర్భిణీ వివరాలను నమోదు చేసుకుంటున్న అత్తిలి పీహెచ్‌సీ ఆరోగ్యసిబ్బంది

అత్తిలి: మాతా శిశు సంరక్షణ లక్ష్యంగా కిల్కారీ పేరుతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గర్భిణిలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, వైద్యపరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేసేందుకు దీనిని అందుబాటులోకి తెచ్చారు. ఈ విధానంపై ప్రభుత్వం ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి....

హలో.. అక్కా నేను మీ డాక్టర్‌ను మాట్లాడుతున్నా. మీ ఆరోగ్యం ఎలా ఉంది? అనే ఆప్యాయమైన పలకరింపుతో గర్భిణిలు, బాలింతలకు ఇకపై ఫోన్లు వస్తుంటాయి. గర్భిణిలు, బాలింతలు ఆరోగ్యకార్యకర్తలు, ఆశ వర్కర్ల వద్దకు వెళితే పేరు, వయస్సు, ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నంబర్, అంచనా ప్రసవ తేది వంటి వివరాలను ప్రభుత్వ ఆర్సీహెచ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. గర్భం ధరించిన మహిళ నాలుగో నెల ప్రారంభం నుంచి కిల్కారీ సేవలు(ప్రతి తల్లి ఆరోగ్యసేవ) ప్రారంభమౌతాయి. గర్భిణి చెప్పే సమాధానాల ఆధారంగా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారు. కరోనా సమయంలో, అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన అవగాహన లేక కొన్ని మాతృమరణాలు సంభవించాయి. మరి కొందరు పౌష్ఠికాహారం, రక్తహీనత లోపాలతో మృత్యువాత పడుతున్నారు. ఇకపై ఇలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది.

72 వారాల పాటు సేవలు



గర్భిణీగా నమోదైన రెండో త్రైమాసికం నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకు ఏయే వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించే ఆరోగ్య సమాచారంతో 72 వారాల పాటు వారానికి ఒక ఆడియో చొప్పున వాయిస్ రూపంలో అందుబాటులోకి తీసుకువస్తారు. ఫలితంగా మాతా, శిశు మరణాలు తగ్గడంతో పాటు సురక్షిత ప్రసవాలకు అవకాశం ఉంటుంది.

– కె శాంతమూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి, మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

గర్భిణీగా నిర్ధారణ అయినపుడే



గర్భిణీగా నమోదైనపుడే వారి ఫోన్ నంబర్ తీసుకుంటారు. వారికి నేరుగా మహిళా డాక్టర్ నుంచి ఫోన్ వస్తుంది. తమకు అందించిన వివరాల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన వైద్యం గురించి వైద్యులు వివరిస్తారు. డాక్టర్ ఫోన్ చేసినపుడు గర్భిణి మాట్లాడటం కుదరకపోతే తిరిగి అదే నంబర్‌కు గర్భిణీ ఫోన్‌చేసి, వివరాలు తెలుసుకునేలా ఈవిధానాన్ని రూపొందించారు.

– డాక్టర్ కె నాగరాజు, పీహెచ్‌సీ వైద్యులు, అత్తిలి.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి



తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినీల సాంస్కృతిక కార్యక్రమాల దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థినీ, విద్యార్థులు ప్రతి కూల పరిస్థితుల్లో కూడా విరామణ లేకుండా ముందుకు సాగాలని విద్యావేత్త డాక్టర్ తాడేపల్లి వీరలక్ష్మీ చెప్పారు. శుక్రవారం తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాల 41వ వార్షికోత్సవం, సీనియర్ విద్యార్థినీలకు నిర్వహించిన నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వీరలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థినులు తమ లక్ష్య సాధనే కర్తవ్యంగా బావించి చదువులో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ వెంకట కృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కేవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లి దండ్రుల స్ఫూర్తిని, ఆశయాలు నెరవేర్చే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే రామకృష్ణ, వివేకానంద గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్ రవీంద్రనాథ్, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో వివిధ అంశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థునులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థునులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వ్యాధులు ప్రబలకుండా తప్పక డ్రైడే పాటించాలి



ఆకుతీగపాడులో ఆరోగ్యకార్యకర్తలు ర్యాలీ చేసి డ్రైడే వశ్యకతను తెలుపుతున్న దృశ్యం

పెంటపాడు: వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తప్పక డ్రైడే పాటించాలని గూడెం మలేరియా సబ్ యూనిట్ వైద్యాధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఆకుతీగపాడు, రావికుంట ప్రాంతాల్లో ఆరోగ్యసిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించి డ్రైడే ఆవశ్యకతను వివరించారు. వైద్యాధికారి ఎస్వీ రమణ ఆధ్వర్యంలో పలు కూడళ్లలో అవగాహన కల్పించారు. వారం రోజులకు ఒక సారి నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేసి డ్రైడే పాటించాలన్నారు. దోమలు, లార్వా ప్రబలకుండా ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి. రత్నం, సాయి కుమారి, ఆరోగ్య కార్యకర్త రమణ, సునంద, సచివాలయ శానిటేషన్ సిబ్బంది ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఐసీఏఆర్ విద్యార్థులతో ఫీల్ఎట్‌హోం



ఐసీఏఆర్ విద్యార్థులతో ఫీల్ఎట్‌హోంలో ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్ దంపతులు

తాడేపల్లిగూడెం: వివిధ రాష్ట్రాల విద్యార్థులను చూస్తుంటే భిన్నత్వంలో ఏకత్వంలా ఉందని, మినీ భారత్ ఆవిష్కరించినట్టుగా ఉందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ టి.జానకీరామ్ అన్నారు. ఉద్యానవర్సిటీలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉద్యానవర్సిటీలో ఔఐసీఏఆర్ కేటగిరీ కింద బి.ఎస్సీ హార్టీకల్చర్, ఎంఎస్సీ హార్టీ కల్చర్ కోర్సుల్లో చేరిన విద్యార్థులతో శుక్రవారం సాయంత్రం ఫీల్ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. ఉపకులపతి అధికారిక నివాసం ఉద్యాన్ సదన్‌లో జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడారు. డిగ్రీతో పాటు తెలుగుభాషను, సంస్కృతిని , ఆహారపు అలవాట్లను తెలుసుకొని , సొంత రాష్ట్రాలకు రాయబారుల మాదిరి ఇక్కడ ఉంటూ ప్రతిభను చూపించాలని వీసీ ఆకాంక్షించారు. వీసీ ఇంటికి ఆహ్వానించి ఆతిధ్యం ఇవ్వడం పట్ల బీహార్, ఒడిషా, మహారాష్ట్ర విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వంకా రవీంద్రకు అభినందనలు



ఎమ్మెల్సీ అభ్యర్థి వంకా రవీంద్రనాథ్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న అత్తిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తిలి: రాష్ట్ర శాసన మండలికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేట్ అయిన ప్రముఖ పారిశ్రామిక వేత్త రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంక రవీంద్రనాథ్‌ను అత్తిలి మండల వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు నూకపెయ్యిరామకృష్ణ, మండల సోషల్ మీడియా కన్వీనర్ యాళ్ల హోనోక్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమ్మాబత్తుల రాము, పార్టీనాయకులు సబ్బితి రాజేష్, యడ్లపల్లి దుర్గారావు తదితరులు వంకా రవీంద్రను కలిసి అభినందనలు తెలిపారు.

పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం



తాడేపల్లిగూడెం పట్టణపరిధి పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలో అచ్చుయంత్రం పితామహుడు జాన్ గూటెన్‌బర్గ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం తాడేపల్లిగూడెం మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జాన్ గూటెన్‌బర్గ్ చిత్రపటానికి అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ముద్రణ రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగాను, పరోక్షంగానే వందలాది మంది జీవనం సాగిస్తున్నారని, దీనికంతటికి కారణం జాన్‌గూటెన్‌బర్గ్‌ని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మద్రి సత్యనారాయణ, నేదూరి స్వామి, గౌరవ సలహాదారులు పీటీ.వెంకన్న, సత్తి జగదీష్‌రెడ్డి, సభ్యులు అవుల రమణ, కొత్తగుండు పండు, గట్టిం నాగేంద్ర, కాళి, శివ, గంగాధర్‌రెడ్డి, సీహెచ్‌హెచ్ వరప్రసాద్, రాజేష్, గోపీ, సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి



పెన్షనర్స్ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు హరికుమార్

తాడేపల్లిగూడెం: పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే గడువు ఇంకా మూడు రోజుల పాటు మాత్రమే ఉందని, వెంటనే వాటిని సమర్పించాలని పెన్షనర్సు అసోసియేషన్ అధ్యక్షులు బి.హరికుమార్ కోరారు. స్థానిక ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడువులోగా వీటిని సమర్పించకపోతే ఏప్రిల్ నుంచి పెన్షన్లు ఆగిపోయే పరిస్థితి వస్తుందన్నారు. ఖజానా కార్యాలయంలో ఇచ్చే ఫారం 16 ఆధారంగా ఇన్‌కంట్యాక్సు వంటివి సమర్పించాల్సి ఉంటుందన్నారు. పెన్షన్ బకాయిల వంటివి వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు వీకే.వీరారావు, ఎం.అర్జునరావు, గరికిపాటి సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

అత్తిలి: సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా శనివారం అత్తిలి మండలంలోగల అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఎలుకల మందును పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. రైతులు విషపు ఎర కలిపిన మందు పొట్లాలను 10 గ్రాముల చొప్పున, గుర్తించిన ఎలుక బొరియలలో పెట్టాలన్నారు. ఈవిషపు ఎరను తిన్న ఎలుక మూడు రోజుల్లో చనిపోతుందన్నారు. రైతులు 15 రోజుల అనంతరం ఒకసారి ఎలుకల ఉధృతిని అంచనా వేసి మరలా విషపు ఎర పొట్లాలను ఉంచినట్లయితే సమర్థవంతంగా ఎలుకల నిర్మూలన చేయవచ్చని చెప్పారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరూ పాల్గొవాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



తాడేపల్లిగూడెం మండలం మాధవరం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆహార సబ్సిడీలు, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ రైతాంగానికి నష్టం కలిగించేలా ఉందని సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మండలంలోని మాధవరం సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ధరలు తగ్గుతాయని ఆశిస్తే నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఔషధాలు, ఎరువులు ధరలు ఏ మాత్రం తగ్గలేదన్నారు. ఈ బడ్జెట్ ప్రజలకు ఏ విధమైన ఉపశమనం కలిగించలేదని విమర్శించారు. సామాన్యుల జీవితాలు మరింత దుర్భరంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎంనాయకులు జి.వెంకట్రావు, పి.జయమ్మ, కె.నాగమణి, పసలపూడి విశ్రాంతి, తిగిరిపల్లి కృప, కడిమినాగమణి, బెల్లంకొండ సత్యనారాయణ, బి.అప్పారావు, కడెం కుమారి, టి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రబడ్జెట్‌ను నిరశిస్తూ ప్రదర్శన

తాడేపల్లిగూడెం: ప్రజలకు వాతలుపెట్టి, కార్పొరేట్లకు దోచిపెట్టి, రాష్ట్రానికి, జిల్లాకు తీరని అన్యాయం చేసిన కేంద్రబడ్జెట్‌ను వ్యతిరేకించాలని కోరుతూ పట్టణంలోని పోలీసు ఐల్యాండ్ వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన చేశారు. పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశపెడితే ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశించారని, అయితే మోదీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు రాయితీలిచ్చేవిధంగా ఉందని విమర్శించారు. నాయకులు కరెడ్ల రామకృష్ణ, చిటికిన రాము, మేట్రేటి రమణ, జవ్వాది శ్రీను పాల్గొన్నారు.

నాడు-నేడు ఫేజ్-2లో గురుకులానికి బెంచీలు



పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకులానికి మంజూరైన బెంచీల్లో విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయానికి నాడు–నేడు ఫేజ్–2లో బెంచీలు మంజూరయ్యాయి. శుక్రవారం వాటిని పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణలకు పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు, స్కూలు కమిటి గౌరవాధ్యక్షుడు కత్తుల రవిజైన్, వైస్ ప్రిన్సిపల్ ప్రతాప్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

తాడేపల్లిగూడెం: గూడెం ఆర్టీసీ డిపోలో పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం యేలూరి సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఈ 9959225488 నంబరుకు ఫోన్ చేసి ప్రయాణికులు సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని వెల్లడించారు.

డేటా ఇంజనీరింగ్‌దే కీలకపాత్ర



కాన్ఫరెన్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వాసవీ ఇంజనీరింగ్ కళాశాల బాధ్యులు

తాడేపల్లిగూడెం: ఆధునిక సాంకేతికతలో డేటా ఇంజనీరింగ్‌దే కీలక పాత్ర అని జేఎన్‌టీయు కాకినాడ ఉపకులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ ఈ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముఖ్య ఉపన్యాసం చేస్తూ సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. జేఎన్‌టీయు కూడా ఈ దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఇటీవల జర్మనీలో జరిగిన గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలితో కలిసి పాల్గొనడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా పలు అంతర్జాతీయ విద్యా ఒప్పందాలు చేసుకున్నామన్నారు. జేఎన్‌టీయుకె అనుబంధ కళాశాలలకు ఈ ఒప్పందాలలో విద్యార్థులకు కొత్త విషయాలు అందించనున్నామన్నారు. సిలికాన్ వాలీ విశ్వవిద్యాలయంతో కూడా అవగాహన ఒప్పందం చేసుకున్నామని , దానిలో భాగంగా గ్రాడ్యుయేషన్ పూర్తైన అనంతరం పోస్టుగాడ్యుయేషన్ విదేశంలో చేసుకొనే వీలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆయా విదేశీ విశ్వవిద్యాలయాలతో చేసుకున్న ఒప్పందాలతో అంతర్జాతీయ సంస్థలతో పాటు స్వదేశీ సంస్థల్లో ఉన్నత ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంటు చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ రత్నాకర్‌రావు,టెక్నికల్ డైరెక్టర్ సీహెచ్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అత్తిలిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యసిబ్బంది

అత్తిలి: దోమల ఉధృతిని అరికట్టడానికి ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీహెచ్ఎ జెఎస్ గనిరాజు చెప్పారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో అత్తిలి-1 సచివాలయం ప్రాంతంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గనిరాజు మాట్లాడుతూ దోమకాటు వల్ల వచ్చే మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగల్గుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది సిహెచ్ భాను, ఎం సుధారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన విద్యార్థులకు బహుమతులు



బహుమతులను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో ఉల్కాన్‌జీ 2023 వేడుకల సందర్భంగా ఉద్యానవర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలకు బహుమతులు లభించాయి. తేనె పట్టు మైనం నుంచి ఏ రసాయనం ఉపయోగించకుండా తయారు చేసిన పెయిన్‌బామ్, లిప్‌బామ్, హనీసోప్, మాయిశ్చర్ లోషన్, క్యాండిల్స్, మస్కిటో రేపెల్లంట్ క్రీం ఉత్పత్తులను ఉల్కాన్‌జీలో ఉద్యాన విద్యార్థులు కీటకశాస్త్ర విభాగాధిపతి ఎస్.ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో ప్రదర్శించి బహుమతి సాధించారు. ఫైనల్ ఇయ్యర్ విద్యార్థులు ఎం.హర్షిత,.జి.హేమలత, ఏ.హర్షవర్ధన్, ఎం.హరిత, హరితవర్షిణి, హేమ, హేమ సత్యవతిలు ఈ బహుమతులు గెలిచారు. వీరిని శుక్రవారం వీసీ టి.జానకీరామ్ అభినందించారు.